www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 9 మార్చి 2024

రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జిగా 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తెలుగుదేశం పార్టీ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రూపానందరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాలతో తనను టిడిపి ఇన్‌ఛార్జిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సీనియర్ టిడిపి, జనసేన నాయకులందరితో కలిసి పనిచేస్తానన్నారు.

చంద్రబాబుతో రూపానందరెడ్డి

టిడిపిలో టికెట్ల టెన్షన్!

- పొత్తు పేరుతో కోల్పోయేదెవరో
- ఆ స్థానాల ఆశావహులకు ఝలక్?
- త్యాగానికి నేతలు ససేమిరా
- గందరగోళంలో కేడర్

టిడిపిలో టికెట్ల టెన్షన్ నెలకొంది. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు జనసేన, బిజెపిలతో పొత్తు కోసం వెంపర్లాడటం తలనొప్పికి కారణమని తెలస్తోంది. బిజెపితో పొత్తు కుదిరితే గెలిచే అవకాశాలు కలిగిన స్థానాలను మిత్రులకు వదులుకోవాల్సి రావడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని ఒక ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను త్యాంగం చేయాల్సి రావడంపై ఆశావహుల్లో అంతులేని నిర్వేదం నెలకొంది. ఐదేళ్లుగా అధికార వైసిపి నాయకుల చేతిలో ఈతిబాధలు అనుభవించిన కేడర్ మనో భావాలను సైతం గాలికి వదిలేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా టిడిపి నేతల్లో అంతర్మథనం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపిని సమర్థంగా ఎదుర్కోవడానికి జనసేన, బిజెపి పొత్తు పెట్టుకోవడం అనివార్యమా అనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఊరూపేరూ లేని జనసేన అభ్యర్థులకు, సంస్థాగతంగా ఎలాంటి బలంలేని బిజెపి అభ్యర్థులకు ఊడిగం చేయాల్సి రావడమేమిటనే వాదన వినిపిస్తోంది. బిజెపి పొత్తు కుదిరితే ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట పార్లమెంట్, జమ్మల మడుగు అసెంబ్లీ టికెట్లు అడిగినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఆశావహుల్లో ఉలికి పాటు కనిపిస్తోంది. టిడిపి రాజంపేట పార్లమెంట్ టికెట్‌ను సుగవాసి బాలసుబ్రమణ్యానికి కేటాయించింది. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపి, బిజెపి పొత్తు పేరుతో రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి వదులుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి అప్పట్లో పోటీ చేసిన సంగతి తెలిసిందే. పదేళ్ల తర్వాత కేలెండర్ మళ్లీ గిర్రున తిరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు కుదిరితే రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి కేటాయించనున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. అధికార వైసిపి అభ్యర్థి పి.మిథున్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండని పరిస్థితుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంట్‌ను వదులుకోవడం సరికాదనే వాదన వినిపిస్తోంది.

గందరగోళానికి కేరాఫ్ జమ్మలమడుగు

జిల్లాలో జమ్మలమడుగుకు ప్రత్యేకతను కలిగి ఉంది. బిజెపితో పొత్తు కుదిరితే టికెట్‌ను వదులుకోవడానికి చంద్రబాబు సిద్ధపడడం కలవరాన్ని కలిగిస్తోంది. వారం రోజులుగా జమ్మల మడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆదినా రాయణరెడ్డి పోటీ చేస్తున్నారనే ఊహ గానాలతో టిడిపి నేతల్లో నిస్తేజం నెలకొంది. జమ్మలమడుగులో అభ్యర్థి భూపేష్‌రెడ్డి తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లోకి చొచ్చుకెళ్లిన సంగతి తెలిసిందే. ఇటువంటి సమయంలో బిజెపికి టికెట్‌ను వదులుకోవాల్సి రావడం ఆశావహులు మొదలు కేడర్‌ను గందరగోళంలో పడేసింది. ఇంత చేసినా టిడిపి ఓట్లు బిజెపి వైపు మళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

కడప 'ఉక్కు'కు బిజెపి ద్రోహం

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలైన కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ అమలుకు బిజెపి కొర్రీలు వేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా మొదలుకుని వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, రైల్వేజోన్ కేటాయించకపోవడం, కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు నిలిపివేత వంటి సహాయ నిరాకరణ చేసిన బిజెపితో పొత్తును ఓటర్లు తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మైనార్టీలైన ముస్లిములు, క్రిస్టియన్లు దూరం కావడం నష్టదాయకమని చర్చించుకోవడం కనిపిస్తోంది.

'కాంట్రాక్టు'పై ఆగమేఘాలు

- గ్రీవెన్స్ సమయంపై అభ్యంతరాలు
- సర్టిఫికెట్ల పరిశీలనలో యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు ఉద్యోగార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆగమేఘాలపై నడుస్తోంది. ప్రభుత్వం రెండు నెలల కిందట జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, కేన్సర్‌కేర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం నోటిఫికేషన్ నుంచి భర్తీ ప్రక్రియ వరకు క్రియాశీలకంగా వ్యవహరించింది. రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలెక్షన్ లిస్టు ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతలు నిర్ధారించడం వరకు విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటువంటి తప్పిదాలను సవరించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కళాశాల ఎదుట పలువురు ఉద్యోగార్థులు ఆందోళన చేశారు. రివైజ్డ్ ఫైనల్ లిస్టు ప్రకటన అనంతరం పోస్టులను భర్తీ చేయాలని, తప్పులను సవరించిన తర్వాత ముందుకెళ్లాలని డిమాండ్ వినిపించింది. రిక్రూట్‌మెంట్ అవకతవకల వ్యవహారం పతాకస్థాయికి చేరుకుంది. కలెక్టర్ స్పందించి రీవెర్ఫికేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీనిపై జిల్లాకు చెందిన పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు నియమించారు. సదరు అధికార యంత్రాంగం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఆగమేఘాలపై చేపట్టడం విశేషం. మహాశివరాత్రి సెలవు సహా మరో రెండు రోజులు సెలవు రోజుల్లోనూ వెర్ఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తోంది. దీనిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా గ్రీవెన్స్ ఉంటే ఎవరికి చెప్పుకోవాలో ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు. గ్రీవెన్స్ సమయం ఇచ్చిన తరువాత వెర్ఫి కేషన్ చేపడితే పారదర్శకతకు అవకాశం ఉంటుందనే వాదనవినిపిస్తోంది.

గ్రీవెన్స్‌కు అవకాశం ఇవ్వండి

కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో చోటుచేసుకున్న అలసత్వానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. వరుస సెలవుల్లో ఆగమేఘాలపై వెర్ఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తే ఇతరుల అభ్యం తరాలను స్వీకరించడం ఎలా సాధ్యం. భర్తీ ప్రక్రియలో అన్యాయానికి గురైన ఉద్యోగార్థులు మరి కొందరు ఉండే అవకాశం ఉంది. ఇటువంటి వారి సమస్యల్ని పరిష్కరించేందుకు గ్రీవెన్స్‌కు సమయం ఇవ్వాలి.

- బి.మనోహర్, రిమ్స్ మెడికల్ యూనియన్ గౌరవాధ్యక్షులు. కడప.

మదనపల్లెలో కేంద్ర బలగాల కవాతు

మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో భాగంగా శుక్రవారం మదనపల్లిలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామని డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. మదనపల్లిలో పోలీస్ 30 యాక్ట్ అమలలో ఉందని చెప్పారు. సభలు సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే అనుమతి తీసుకోవాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిఐలు వల్లిబాషా, యువరాజు, ఎన్.శేఖర్, సద్గురుడు, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, వెంకటేష్, రవి కుమార్ ఎఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి, జనసేనతోనే మహిళా సాధికారత

ప్రజాశక్తి-మదనపల్లి

మహిళల అభ్యున్నతికి పాటుపడే పార్టీలు తెలుగుదేశం, జనసేనేనని టిడిపి పట్టణ అధ్యక్షులు జోలేపాలెం భవాని ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ యువ నాయకులు దొమ్మలపాటి యశశ్వి రాజ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన అధికారంలోకి రాగానే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, మహిళా నాయకులు మైథిలి, పులి మహాలక్ష్మి, లక్ష్మీదేవి, ఉషారాణి, తలారి రాధా, ప్రమీల, ఈశ్వరి, రాధా పాల్గొన్నారు. **మిట్స్‌లో...** కళాశాల ఐఐసి కో-ఆర్డినేటర్ డాక్టర్ గీత దేవి ఆధ్వర్యంలో మహిళా దినత్సోవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళ అని, మహిళ అనుకుంటే ఎంతపనైనా ఏ పనైనా సాధిస్తుందని చెప్పారు. వివక్ష వేధింపులు, సాధింపులున్నా, అవకాశాలు రాకపోయినా, అవమానాలు ఎదురైనా మహిళలు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. స్త్రీ సమానత్వం, సాధికారతే సమాజ ప్రగతికి మూలమన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కల్పన మాట్లాడుతూ ఇంటాబయట మహిళలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. మహిళలకు నిర్వహించిన కార్యక్రమాలలో బహుమతులను అందజేశారు. **పీలేరు:** రాష్ట్రంలో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ లక్ష్యమని మహిళా సంఘాలు తెలిపాయి. మహిళా దినోత్సవం సందర్భంగా టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఆడబిడ్డ చదువుకు ఆటంకం కలిగి వారు ఇంటికి పరిమితం కాకూడదన్న ఆలోచనతో తెలుగుదేశం పార్టీ సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

పీలేరు: కేక్ కట్ చేస్తున్న తెలుగు మహిళలు

కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షులు సాధన, పీలేరు మండల అధ్యక్షులు పురం రెడ్డెమ్మ, రమాదేవి, లక్ష్మీ కాంతమ్మ, అనూరాధ, చందన, దేవమ్మ, షమ, కళావతి, కాంతమ్మ, రెడ్డిరాణి, హేమావతి, విజయ, రక్షిత, వనిత, రజిత, సుశీలమ్మ, లక్ష్మి దేవి, చంద్రలేఖ, వాణి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి** :మండల కేంద్రంలోని స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు విశ్వభారతి పాఠశాల డైరెక్టర్ ఆర్.రామచంద్రయ్య, కరస్పాండెంట్ కె.రఘునాథరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం దృశ్యాలతో సత్కరించారు కార్యక్రమంలో పాఠశాల ప్రైమరీ హెడ్మాస్టర్ ఆర్.రవీంద్ర ఉపాధ్యాయులు దర్బార్, చంద్రాయుడు, రవికుమార్, ధను, ప్రసాద్, ప్రతాప్ స్వామికొండ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం అన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, విద్యార్థులకు ప్యాడ్లు, పెన్‌లు పంపిణీ చేశారు. తన తండ్రి జిల్లా వక్ఫ్ కమిటీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ జలీల్ సాహెబ్ జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ శ్రేణి మార్కులను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చి, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో టాప్ టెన్ ర్యాంకులలో స్థానాన్ని సాధించేందుకు విద్యార్థులు పోటీపడాలని, టాప్ టెన్‌లో రాణించిన విద్యార్థికి తాను రూ.10,116 బహుమానంగా ఇచ్చి, మైనారిటీ సంక్షేమ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కరిస్తామన్నారు. పదవ తరగతి విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టివిలకు దూరంగా ఉండాలని, చదువుపై ఏకాగ్రతతో శ్రద్ధ సాధించాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో ఉత్కంఠకు గురికారాదని, ప్రశాంతమైన మనసుతో ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు అర్థం చేసుకొని సమాధానాలు రాయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు శంకరప్ప, కరీముల్లా, గుల్జార్, అలీ ఖాన్, అయాజ్, మెహరాజ్, నవాజియా బేగం, రోషన్ జమీర్, ఉర్దూ అకాడమీ గ్రంథాలయాధికారి ఆబిద్ హుస్సేన్, మైనారిటీ నాయకులు షాహిద్, సమీవుల్లా పాల్గొన్నారు.



విద్యార్థికి ప్యాడ్ పంపిణీ చేస్తున్న అబ్దుల్ కలీం

మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి'

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు అన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు చివరి రోజు శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వారం రోజులుగా ఒంటిమిట్ట పల్లెలు అనేక కార్యక్రమాలు కంప్యూటర్ విద్యపై అవగాహన, ఓటు హక్కు వినియోగం పై అవగాహన, స్వచ్ఛభారత్, రోడ్డు మరమ్మతులు వంటి కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రకరకాల మొక్కలు సేకరించి స్కూల్ ఆవరణచపల్లె పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పల్లె ప్రజలు స్కూలు అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. వారం రోజులుగా రకరకాల కార్యక్రమాలు చేపట్టారని తద్వారా పల్లె పురోగతికి పాటుపడ్డారని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్ కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీలను తరిమికొట్టండి

- సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, శాంతిభద్రతలు కాపాడాలన్నా అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలోని యాకూబ్ సాబ్ మజీద్ వద్ద కాంగ్రెస్ పార్టీ కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితులలో కేంద్రంలో, రాష్ట్రంలో సెక్యులర్ పార్టీ అయినా కాంగ్రెస్ ప్రభుత్వ రావాలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పది సంవత్సరాలుగా బిజెపి, జగన్ ప్రభుత్వాలతో దేశ, రాష్ట్ర ప్రజలు ఎన్నో అరాచకాలకు, దౌర్జన్యాలకు గురి అయ్యారని చెప్పారు. వారి కబంధహస్తాల నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధిష్టానం తాను చేసిన సంఘ సేవ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి తనకే కడప అసెంబ్లీ టికెట్టు కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందనే చెప్పారు. కాంగ్రెసు పార్టీ మొదటి నుంచి మహిళ సాధికారతకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. అనిబ్ సెంట్, సరోజినినాయుడు, ఇందిరాగాంధీ, సోనియాగాంధీలు పార్టీలో అత్యున్నతమైన ఎఐసిసి అధ్యక్ష పదవులు అలంకరించినట్లు చెప్పారు. ప్రతిభా పాటిల్ రాష్ట్రపతిగా, ఇందిరమ్మ ప్రధానిగా, మీరా కుమార్ లోక్ సభ స్పీకర్‌గా ఉన్నత పదవులు అలంకరించారని పేర్కొన్నారు. మహిళ రాజకీయ, సాంఘిక ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందని చెప్పారు. బాలింతలకు, గర్భిణులు, బాల బాలికల పౌష్టికాహారం లోప నివారణ కోసం 1975లోనే అంగన్వాడీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. బాలికల బంగారు భవిష్యత్తు కోసం బంగారు తల్లి పథకం, గృహిణిల కోసం అమ్మ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. అమ్మహస్తం, బంగారు తల్లి పథకాలను రద్దు చేసిందని చెప్పారు. డ్వాక్రా మహిళల సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని రూ.5 లక్షల నుండి రూ.3లక్షలకు తగ్గించడం జరిగిందని చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ టీచర్లు శైలజా, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, రమాదేవిలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌యుఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధృవకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, రాజా, నరసింహారెడ్డి, ఉత్తన్న, వినయ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో 'షిరిడీ సాయి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-రాయచోటి

2023 డిసెంబరులో జరిగిన డిగ్రీ 1వ సెమిస్టర్ హానేర్స్ పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీ షిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు అఖండ విజయాన్ని కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ టి.వెంకట చలమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన 1వ సెమిస్టర్ హానేర్స్ ఫలితాలలో యూనివర్సిటీ స్థాయి ర్యాంక్ లో తమ విద్యార్థులు బిఎస్‌సి హానేర్స్ ఎస్.కౌజర్ జన్ 10/10, 9.50 అర్.హరిత, 9.50 ఎస్.రైసా సడఫ్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎస్.సభనం 9.50, కె.వేదమయి 9.50, వి.ప్రత్యూష 9.50, బి కామ్ విభాగంలో హెూనేర్స్ కంప్యూటర్ అప్లికేషన్ ఎం.మధురిమ 9/10, బిసిఎ హానేర్స్ కంప్యూటర్ అప్లికేషన్ 9/10, బికామ్ హానేర్స్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగం లో పి.మసిహా 9/10, బి.రెడ్డి లక్ష్మి 9/10, జి.బ్లెసీ 9/10, ఎం.సంధ్య రాణి 9/10, ఎం.నాగ జయశ్రీ 9/10, వి.మమతేశ్వరి 9/10 పాయింట్స్‌తో విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. పట్టుదల, ఉత్తమ క్రమశిక్షణతో విద్యార్థులు ఉత్తమ స్థాయికి వెళ్తారని ఇంతటి యూనివర్సిటీస్థాయి గొప్ప ఫలితాలను సాధిస్తారున్నారు. విద్యార్థునిలను కరస్పాండెంట్ వెంకట చలమారెడ్డి, డైరెక్టర్ మనోజ్ కుమార్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

'వైసిపి అభ్యర్థుల గెలుపునకు సహకరించాలి'

ప్రజాశక్తి-పీలేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేల గెలుపుకు అందరూ సహకరించాలని జిల్లా పంచాయతీరాజ్ అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పెద్ద మసీదు వద్ద కరపత్రాలు పంచి మైనార్టీ సోదరుల సహకారాన్ని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన, మైనార్టీ, రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని అన్నారు. అలాగే విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూడా విశేష కృషి అందిస్తోందని చెప్పారు. పట్టణ చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని ఇంటి స్థలాలు కేటాయించిన ఘనత కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, ప్రభుత్వం నుంచి మరెన్నో కొత్త కొత్త సంక్షేమ పథకాలు రావాలన్న, అన్ని రంగాల్లో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలన్నా మనం తిరిగి ఎంపీగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతల రామ చంద్రారెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని, రాష్ట్రంలో తిరిగి జగన్ ప్రభుత్వం ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పెద్దోడు, చలపతి, ఎంపిటిసిలు ఇబ్రహీం, జోహార్, ఎఎంసి డైరెక్టర్ మునీర్, వార్డు సభ్యులు ఆబిద్, పరమేష్, పిక్కా రమణ, సీనియర్ నాయకులు జీలాని, ముస్తాక్, కదిరి రఫీ, స్వీట్స్ షఫీ, మాజీ ఉప సర్పంచ్ మహబూబ్ బాష, ఎల్ఐసి రహమతుల్లా, మహబూబ్ బాష, షారూ, మొహమ్మద్ షరీఫ్, అక్రమ్, షాకీర్, నిజాం, అబ్బాస్, ఖాజా మొహిద్దీన్, మణి పాల్గొన్నారు.

10న రాజంపేటలో మొల్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రామాయణాన్ని రచించిన తొలి కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి వేడుకలను ఈనెల 10వ తేదీ రాజంపేటలో నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యూచర్ మైండ్స్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు నందకిషోర్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, పీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్ కుమార్ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వాల్మీకి శంఖారావ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకి, బోయల ఎస్టీ పునరుద్ధరణే లక్ష్యంగా వాల్మీకి సంఘాలన్నీ రాజకీయాలకు అతీతంగా ఏకమై ఈ నెల 24వ తేదీన పట్టణంలో భారీ ఎత్తున నిర్వహించే శంఖారావ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పొదల నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వాల్మీకి విగ్రహం వద్ద శంఖారావ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశమే లక్ష్యంగా సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు భారీ సంఖ్యలో వాల్మీకి, బోయలు కదలి రావాలని, తద్వారా ఎస్టీ జాబితా పునరుద్ధరణను సాధించుకుందామని పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో వాల్మీకులకు 3 శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషను అక్కడ వాల్మీకుల ఐక్యతతో 7 శాతం సాధించుకున్నారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఎపిలోనూ ఎస్టీ రిజర్వేషన్ సాధించుకుందామన్నారు. ప్రభుత్వాలు మారుతున్న వాల్మీకుల తలరాతలు మారకపోవడం బాధాకరమన్నారు. వాల్మీకి, బోయల మౌనం జాతి అభివృద్ధికి ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో నల్లబోతుల సుదర్శన్‌బాబు, నాగినేని గోవిందు, మేకల విజయ్‌మోహన్, మక్కినేని వేణుగోపాల్, ముత్తరాసి హరికృష్ణ, మారా కృష్ణమూర్తి, తవళం లక్ష్మన్న, కొటికి శేఖర్, కొత్తవుడుం శంకర, కొటికి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకి సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి-కలకడ

శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని దేవలంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి లక్ష్మీ శ్రీనివాస ప్రసాద్, రామసుబ్బమ్మ దంపతులు, అఖిలేష్, శ్వేత మాల దంపతులు రామ్‌కిషోర్, సరళ దంపతులు, గుణ, యశ్వంత్ ఉభయదారులుగా పాల్గొని శ్రీ విజయ సారథి వేద పండితుల మధ్య కల్యాణం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త అఖిలేష్ తెలిపారు. అనంతరం శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వాములవారిని గజవాహనంపై పురవీధులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, మల్లికార్జున్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, కుమార్ నాయుడు, జనార్దన్ నాయుడు, నరసింహులు, రెడ్డప్పనాయుడు, రామయ్యచౌదరి, శేఖర్‌నాయుడు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం, శ్రీ యోగ నేలమ ల్లేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు సాంప్రదా యబద్ధంగా, వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామి వారిని విశేష అలం కరణతో, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకలలో ఆలయ ఆచా రాలను పాటిస్తూ, సాయంత్రం 6 గంటలకు, బంగి కృష్ణప్ప చే గార్గేయ శిఖరము నందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామివారికి ఆలయ పూజారి శంకరశర్మ ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వర కల్యాణం కన్నుల పండువగా, వైభవంగా, ఉభయదారులు గంగాధరం దంపతులచే నిర్వహించారు. రాత్రి జాగరణలో భాగంగా, నాయునివారిపల్లె నాట్య కళా మండలి వారిచే, సాసవుల చిన్నమ్మ కథ నాటకాన్ని ప్రదర్శించారు. స్వామివారి కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహా శివరాత్రి జాగరణ, పగలు తిరణాల ఏర్పాట్లను ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు కట్టుదిట్టంగా పూర్తి చేశారు. ఎస్ఐ లోకేష్ రెడ్డి ఆలయం వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని, ఆలయ నిర్వాహకులు, పెద్ద ఎత్తున చేపట్టారు. భక్తులు వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లి ఆర్టిసి డిపో వారు బస్సులను నడిపారు. దేవాదాయశాఖ అధికారులు, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణారెడ్డి

మండలములో ఎక్కడైనా సభలు, సమావేశాలు నిర్వహించు కోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. డిఎస్‌పి మహబూబ్‌బాషా ఉత్తర్వుల మేరకు మార్చి1 నుంచి31 వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. 30 పోలీసు యాక్ట్ ప్రకారం మైకులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించు కోవాలంటే తప్పకుండా పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని చెప్పారు. వివాహ,శుభకార్యాలకు ఎలాంటి షరతులు లేవన్నారు.

మహిళలతో పశు వైద్యులు జయప్రకాష్

నట్టల నివారణ మందులు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాడి పశువుల కలిగిన మహిళకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశు వైద్యులు జయప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందుతో మూగ జీవాల్లో వ్యాధిని రోధకశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ మందుల ద్వారా జీవాల ఆరోగ్యం మెరుగుపడుతుందని, మృత్యువాత పడకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు జయప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నక్క సతీష్, కుటుంబ సభ్యులు

టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-గుర్రంకొండ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కృషి చేస్తామని మాజీ ఎంపిపి నక్క సిద్దులు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దులు కుటుంబ సభ్యులు నగిరిపల్లిలో పీలేరు టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నక్క సతీష్ మాట్లాడుతూ మండలంలో టిడిపి స్థాపించి నప్పటి నుంచి అహర్నిశలు కష్టపడ్డామని అన్నారు. కుల, మతాలకు అతీతంగా, ఎవ్వరితో విభేదాలు లేకుండా కలిసిమెలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల పార్టీకి దూరంగా ఉన్నామని తెలి పారు. మరల క్రియాశీలకంగా పనిచేసి టిడిపికి పూర్వ వైభవం తీసుక వస్తామని చెప్పారు. చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్య మంత్రిగా చూడాలని, కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శాయ శక్తుల కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జగదీష్, మాజీ సర్పంచ్ షేక్‌నౌషాద్, మాజీ ఎంపిటిసి షేక్ ఏజాస్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్‌విడిసి విద్యార్థులకు యూనివర్శిటీ ర్యాంకులు

ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్: ప్రొద్దుటూరు పట్టణం శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగి వేమన యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో యూనివర్శిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంకులను సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఏ హరినారాయణ తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో బిఎస్‌సి జువాలజీ బయోటెక్నాలజీ జి. తేజస్విని 10/10, వి.తన్మయ 10/10, కె.జ్ఞాన శ్రీ 10/10, బిసిఎ గ్రూపులో టీ. నూరిన్ 10/10 జిపిఎస్ యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంకులను సాధించారన్నారు. బిఎస్‌సి జువాలజీ గ్రూపులో చందన 9.50, లాలస 9.50, అశ్విని 9.50, బిఎస్సి బయోటెక్నాలజీ గ్రూప్‌లలో ఫర్హా 9.50, బిఎస్‌సి జువాలజీ విభాగంలో మాధవి 9.00, సంధ్యా 9.00,ఆస్మా 9.00,నిత్య 9.00, తస్లీమ్ 9.00,బీకాం కంప్యూటర్స్‌లో హసీనా 9.00, బిసిఎ విభాగంలో అఫ్జాల్ 9.00, బిఎస్‌సి కంప్యూటర్ విభాగంలో నాగకళ్యాణి 9.00 సుప్రజా 9.00 జిపిఎసాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ ముస్తఫా రామ్మోహన్, అధ్యాపకులు అభినందించారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

రామాపురం : శివాలయంలో ప్రత్యేక పూజల్లో శ్రీకాంత్‌రెడ్డి దంపతులు

ప్రజాశక్తి-రామాపురం

మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం మండలంలోని హసనాపురం స్థానమలేశ్వరస్వామి శివాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు సుదీప్‌రెడ్డి, పప్పిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చలమారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి రమణ, హరినాధ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, అమర, కో–ఆప్షన్ హజీమ్, నాగార్జున పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బీరంగి పంచాయతీ,గూగూటి కోనలో వెలసిన బండెన్నస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా బండెన్న స్వామి ఆశ్రమ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి మాట్లాడుతూ మహాశివరాత్రికి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారన్నారు. ఆలయంలో నిర్వహించిన స్ఫటిక లింగం, బండెన్న స్వామి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకం, చెక్కభజన, ఆర్కెస్ట్రా, సాసవల చిన్నమ్మ కథ కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. నిరవధికంగా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. **కలికిరి :** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, గుట్టపాలెం పంచాయతీ కె.బర్నేపల్లి పూలకొండలోని భ్రమరాంబిక మల్లికార్జున ఆలయంలో భక్తులు శివనామస్మరణతో విశేష పూజలు అందుకున్నారు. ఉదయం నుంచి హోమాలు, అభిషేకాలతో మొదలై రాత్రంతా పార్వతీ పరమేశ్వరుల కథ కాలక్షేపం, కోలాటలు, భక్తి గీతాలుతో జాగారం నిర్వహించారు. శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. **పెద్దమండ్యం :** మండలంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామికి, పాపేపల్లి పంచాయతీ శివాలయంల్లోనూ, శివపురం సమీపంలోని నేలమల్లయ్య స్వామికి, వెలుగళ్లు శివాలయంలోనూ సిద్దవరం మల్లికార్జున స్వామి, ముసలీకుంట శివాలయంలో నువేదమంతాలతో పూజలు నిర్వహించి అభిషేకంపూజలు నిర్వహించారు. శివపురం నేలమల్లయ్యస్వామి ఆలయం, పెద్దమండ్యం శ్రీభవాని శంకరాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భజనలు ఏర్పాటు చేశారు. మల్లయ్య కొండలో వెలసిన మల్లికార్జున స్వామి దర్శనం కోసం భక్తులు సౌకర్యాలు కోసం ఉచిత బస్సులను దాసిరిపల్లి జయ చంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పురహితులు మణికంఠస్వామి, ప్రసాద్‌స్వామి, పణిస్వామి, జ్యోతి శంకర్‌స్వామి, అచ్చుతా స్వామి, పవనస్వామి, కృష్ణమూర్తి స్వామి పాల్గొన్నారు.

అత్తిరాల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న 'చమర్తి'

రాజంపేట అర్బన్ : అత్తిరాల కామాక్షి త్రేతేశ్వరస్వామి ఊటుకూరు శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భక్తులు తండోప తండాలుగా పాల్గొన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకొని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు కొవ్వూరు సుబ్రహ్మణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, ఊటుకూరు చంగల్‌రాయుడు, పెంచల్‌రాజు, రవీందర్ రెడ్డి, వేల్పుల బాలా, సాంబార్ లక్ష్మీనారాయణ, జగదాభి లక్ష్మీనారాయణరాజు, దేవరాజు వేణు గోపాలరాజు, లక్ష్మీపతి రాజు, రిటైర్డ్ ఏ.ఎస్.ఐ శ్రీనివాసరాజు, మండల సీని యర్ నాయకులు జీ.వి సుబ్బరాజు, కోటయ్య నాయుడు పాల్గొన్నారు. **పీలేరు :** మండలంలోని శైవాలయాలు జనసంద్రంతో నిండిపోయాయి. పీలేరు పట్టణంలోని శ్రీ కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, మండలంలోని శివరామపురం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం, అడవిపల్లి శ్రీ మద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయానికి వచ్చే భక్తులకు నిర్వాహకులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. రాత్రి జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాల్లో వైభవంగా నిర్వహించారు.

రాజంపేట : సందర్శకులకు భోజనాన్ని వడ్డిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించారు.. సేవలు మరిచారు..

- నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రజాశక్తి -ఖాజీపేట

'ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తాం.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.' ఇటువంటి మాటలు మనకు తరచూ విన్పిస్తుంటాయి.. కానీ వాస్తవానికి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందుకు ఉదాహరణే నిరుపయోగంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ వివరాలు.. మండలం పరిధిలోని పత్తూరు పంచాయతీ డాంఖాన్‌పల్లె గ్రామంలో లక్షలు వ్యయం చేసి నూతనంగా డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రం నిర్వించారు. నిర్మించి కొన్ని నెలలవుతున్నా ఇంతవరకూ ప్రారంభించిన పాపాన పోలేదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంపై పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేక విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రానికి వెళ్తే అక్కడ ఎప్పుడూ మూసి ఉండడంతో ఏమి చేయలేక వెనుదిరిగావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో నిర్మించిన హెల్త్ క్లిన్ నిరుపయోగంగా మారింది. నెలకు ఒకటో, రెండు సార్లు మాత్రమే తెరుస్తారని అదీ సకాలంలో తెవరకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య శాఖ ఉన్నత అధికారులు స్పందించి వైద్య కేంద్రం సకాలంలో తెరిచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

'ఇరగంరెడ్డి'కి సాటిలేరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో దువ్వూరు సీమలో ఇరగం రెడ్డి అనే పుస్తకం ఆవిష్కరణ నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురాం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఇరగంరెడ్డి అనే పదానికి ఎవరు సాటి లేరని ఆయన అన్నారు. ఇరగం రెడ్డి తిరుపాలురెడ్డి, ఆయన జీవిత చరిత్ర పుస్తకం డాక్టర్ తవ్వ వెంకటసుబ్బయ్య రచించడం అభినందనీయమన్నారు. ఇరగరంరెడ్డి చేసిన మంచి పనులలో ఎక్కువగా దూరప్రాంత విద్యార్థులకు పుల్లారెడ్డిపేటలో ఒక జడ్పీ హై స్కూలు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, నిర్మించడమేననిచెప్పారు. కస్తూరిబాకు ఉచితంగా ఇవ్వడం స్థలం ఇచ్చారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో ఉందని అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మల్లెల ఝాన్సీ రాణి, పలువురు ప్రముఖులు కవులు పాల్గొన్నారు. **డిసిసిబి భవనానికి శంకుస్థాపన..** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయబోయే డిసిసిబి శాశ్వత భవనానికి అప్కోబ్ ఛైర్మెన్ మల్లెల ఝాన్సీరాణి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు.. డిసిసిబి మాజీ ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి జీవితం పుస్తక ఆవిష్కరణ రోజు భూమి పూజ చేయడం విశేషమని ఆమె అన్నారు. కార్యక్రమంలోఎమ్మెల్యే రఘురామి రెడ్డి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, డిసిసి బ్యాంకు మేనేజర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

చక్రాయపేట : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది ఎలాగో అలాగే రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని ట్రిపుల్ ఐటీ తుపాకుల వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చక్రయపేటలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు దాదాపు 30 మంది దాతలు రక్తదానం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సిబ్బంది, మైదుకూరు ఆస్పత్రి సిబ్బంది ఆనంద్ రెడ్డి, ఖలీల్ బాషా, శివరాజ్, పుల్లయ్య పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని కలిసిన నాయకులు

లింగాల : మండలంలోని వైసిపి నాయకులు శుక్రవారం వేంపల్లిలో ఎస్.వి సతీష్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కడప పార్లమెంటరీ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి సతీష్ రెడ్డినిశాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం సతీష్ రెడ్డితో వారు మాట్లాడుతూ తమ మండల నాయకుల కోరిక మేరకు లింగాల మండలానికి రావాలని కోరారు. సమయం తీసుకొని తప్పకుండా మండలానికి వచ్చి అందరిని కలుస్తానని సతీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి మాజీ సర్పంచ్ అనిల్ లోకేశ్వర్‌రెడ్డి రామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యం

ఖాజీపేట : రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని, ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో పని చేయాలని మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన వైసిపి ముస్లిం మైనారిటీ నాయకులు అర్షద్‌తో పాటు ఆయన అనుచర వర్గం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండలం కన్వీనర్ లక్ష్మిరెడ్డి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు ఎటు వంటి కష్టం వచ్చినా అన్ని విధాలా ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో జన సేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్హోత్రా, మండల సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు ఖాదీరుల్లా, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిటాల వీరయ్య, హరినాథ్ రెడ్డి, పుల్లయ్య నాయుడు, జానకి రామ్ నాయుడు, కమలాపురం ఫరూక్, జలీల్ అహ్మద్, జండాల మహబూబ్ బాషా, పిచ్చి నాయుడు, ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, గంగిరెడ్డి చిన్న, ఐటిడిపి మండల అధ్యక్షులు పాపాన మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సిరిగిరెడ్డి సూర్యనారాయణరెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సిరిగిరెడ్డి సూర్యనారాయణరెడ్డి (6 నేత్రదానం చేశారు. ఆయన మరణించడంతో సతీమణి సుశీల, కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కోడలు సునీత, తమ్ముడు గోపాల్ రెడ్డి, మరదలు మంగమ్మ, చెల్లెలు శారద, బావమరిది ఆనంద్‌రెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహంలోపార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్టు సేవాసమితి అధ్యక్షులు రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా చూపు లేనివారి చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా ఈ లోకాన్ని చూసే అవకాశం గొప్పవరమన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364 లేదా 7093 204537లలో సంప్రదించినట్లు అయితే పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి అంధత్వంతో బాధపడుతున్న అంధులకు అమర్చి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారన్నారు. నేత్రదానం పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించి, నేత్రదానం చేసిన సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులకు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సర్వోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, గ్రామస్థులు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

అప్పస్వామి ఆలయానికి జనరేటర్ వితరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురి జాలలో వెలసిన శ్రీ అప్పస్వామి ఆలయానికి జనరేటర్ వితరణగా అందజేశారు. శుక్రవారం మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని విద్యుత్ శాఖ లైన్‌మెన్ మంజుల వెంకట శేఖర, వెంకట కుమారి దంపతులు రూ.34 వేలు విలువ చేసే జనరేటర్ ను ఆలయ ధర్మకర్త ఏ. భాస్కర్ రెడ్డి అందజేశారు. ఆలయ అర్చకులు మురళిస్వామి జనరేటర్‌కు పూజలు నిర్వహించిన అనంతరం వినియోగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కర్ణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మోసపోయారు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ విషయంలో ప్రభుత్వం చేతిలో మోసపోయారని కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆర్‌టిపిపి రీజినల్ కార్యదర్శి సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌టిపిపిలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 నవంబర్ 9న పాదయాత్రలో భాగంగా ఎర్రగొండ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్ పై ఇచ్చిన మొదటి హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యుత్ లేనిదే చిన్న పని కూడా జరగదని అలాంటిది విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మాత్రం అంధకారంలో ఉన్నాయని అన్నారు. ఆ తెలంగాణలో 2017లో 23 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి సంస్థలో విలీనం చేశారని అన్నారు. వేతనాల్లోనూ న్ స్కిల్డ్ నుండి హై స్కిల్డ్ వరకు రూ. 7000 నుండి రూ.16,000 వరకు వ్యత్యాసం ఉందని తెలిపారు. కానీ ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోగా ఒక రూపాయి కూడా జీతం పెంచడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 24 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, 1.8 లక్షల మంది వారి కుటుంబ సభ్యుల ఆదరణను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం అర్హత, అనుభవం ఆధారంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా ఆయన కోరారు.

లక్ష్మీనారాయణకు ట్రైసైకిల్ అందిస్తున్న మాలిక్‌ఖాద్రి

విభిన్న ప్రతిభావంతుడికి ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని హట్కో కాలనీలో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతుడు సి.లక్ష్మీనారాయణకు వైసిపి నాయకులు బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందించారు. ఈ సందర్భంగా వైసిపి స్టేట్ మైనారిటీ సెక్రటరీ ఎన్‌జిఒ మెంబర్ మాలిక్‌ఖాద్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిలు కృషి ఉంటుందని అన్నారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లినప్పుడు దివ్యాంగుడి పరిస్థితిని చూసి గమనించిన ఎంపీ ఇతనికి ట్రై సైకిల్ ఇస్తామని చెప్పిన హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కంచి కల్యాణ్ కుమార్‌రెడ్డి, జివి.రామకృష్ణ, వరప్రసాద్, నాయకులు హరికృష్ణ సబ్జీ, రామకృష్ణ టైలర్, మోహన్, బాబా, సూరి పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న సిబ్బంది

స్టేషన్‌కు చేరిన 'పది' పరీక్ష పత్రాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీసుస్టేషన్‌కు పదవ తరగతి పరీక్ష పత్రాలు చేరినట్లు రూట్ అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.మండలంలోని కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు), కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాలుగా ఉన్నతాధికారులు ప్రకటించడంపై ఈనెల 18వ తేదీ నుండి 10వ తరగతి పరీక్షలు నిర్వహించవలసి ఉండగా మొదటి సెట్ ప్రశ్నాపత్రాలు భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలకడ, కోన, ఆదర్శ పాఠశాలల సిఎస్‌లు శ్రీధర్, వెంకటరమణ, రామానుజులు, డిఒలు ఖాదర్ బాషా, నాగముని నాయక్, శంకర్ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయరెడ్డిని టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేష్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలానికి చెందిన పలువురు వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. టీడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో కదిరిలో చేపట్టిన శంఖారావం సభలో నారా లోకేష్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పించుకొని టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పెద్దమండ్యం మాజీ ఎంపిపిరజనీ, దత్తాత్రేయరెడ్డి మంత్రి గిరిధర్ రెడ్డి,ఆంజనేయ రెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి మంత్రి ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎఫ్ఇఒ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, చిటికి శివారెడ్డి, పట్టెంహరీష్ రాయల్ అరుణ్ రాయల్, కొండ్రెడ్డి అశోక్‌రాయల్, బయప్పగారిపల్లి ఉలవల విశ్వనాథరెడ్డి, రంగప్ప యాదవ్‌తో పాటు మరో యాభై మంది పార్టీలో చేరినట్లు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాలలో ఆర్‌టిడి డిగ్రీ కళాశాల విజయభేరి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక మైదుకూరు రోడ్డు లోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 2023 డిసెంబర్, జనవరి నెలలో యోగివేమన యూనివర్సిటీ వారు నిర్వహించిన మొదటి సెమిస్టర్ డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలలో చక్కటి ప్రతిభను కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక జిపిఎ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ టి. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు బిఎస్‌సి హానర్స్ కంప్యూటర్ సైన్స్‌లో ఎం. విజ యలక్ష్మి 10/10 జిపిఎ, ఎం. వీరభార్గవి 9.5, జెఎస్ యాసిన్ 9.5, ఫస్ట్ బయోటెక్నాలజీలో ఎస్ షాహిన్ 10/10, బి సమీనా మహబూబ్ 9.5, శ్రీలత 9.5, ఎస్ సల్మా రంబు భాయ్ 9.5, టి వాణి 9.5, అలియా మోహిన్ 9.5 సాధిం చారని చెప్పారు. బికాం హానర్స్ కంప్యూటర్స్ అప్లికేషన్‌లో, బి. గంగా భవానీశ్వరి 9.5, ఎస్ రిజ్వానా భాను 9.5 జిపిఎ పాయింట్స్ సాధించారని తెలిపారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలో చుట్టుపక్క గ్రామాలలో మూడు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. దాడులలో 14 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.50వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. **మదనపల్లి :** పేకాట ఆడుతున్న 27మందిని పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ వల్లిబాషా తెలిపారు. పట్టణంలోని నీరుగట్టు వారిపల్లె రామిరెడ్డి లేఅవుట్లో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 27 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.61,050లు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, విచారణ అనంతరం వారిపై ఎపి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామని సిఐ తెలిపారు.

జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బందిపై దాడి

-పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులపై రోగి అటెండర్లు శుక్రవారం ఉదయం దాడి చేశారు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. చిన్న పిల్లల వార్డుకు వెళ్లే దారి ఇది కాదు.. వేరే దారిలో వెళ్లాలని సూచించినందుకు దాడి చేశారని అన్నారు. దాడి చేసే వారిని సెక్యూరిటీ గార్డు, ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీస్ కానిస్టేబుల్ భాస్కర్ నాయక్ అడ్డుకోబోయిన వినకుండా దాడి చేశారని చెప్పారు. దాడిలో స్వీపర్ గంగాదేవి, సెక్యూరిటీ కార్డు రమేష్, హరి, శాంతకుమారిలు గాయపడ్డారని చెప్పారు. ఆస్పత్రి సిబ్బందిపై మూకుమ్మడిగా దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకుంది. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు వెంటనే జిల్లా ఆస్పత్రికి చేరుకుని దాడికి పాల్పడ్డ నలుగురిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని తెలిపారు.